క్లుప్తంగా

అక్రమ నిర్మాణం ఆపాలని వినతి



వనపర్తి క్రైం: జిల్లా కేంద్రంలోని టీచర్స్ కాలనీలో ఇంటి నిర్మాణం పేరుతో అక్రమంగా మసీద్ నిర్మాణం చేపట్టారని.. కాలనీవాసులు దీనిపై మొరపెట్టుకున్నా రహస్యంగా పనులు చేపట్టారని, వెంటనే సమస్యను పరిష్కరించాలని హిందువాహిని, భజరంగ్ దళ్ కార్యకర్తలు సోమవారం ఎస్పీ అపూర్వరావుకు ఫిర్యాదుతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ టీచర్స్ కాలనీలో ఒక మసీద్ ఉన్నప్పటికీ, రాత్రికి రాత్రే మరో మసీద్ నిర్మాణ పనులు చేపడుతున్నారని, వెంటనే అనుమతి లేని ఆ నిర్మాణాన్ని ఆపాలని వారు కోరారు. కార్యక్రమంలో హిందూవాహిని జిల్లా కోకన్వీనర్ అరుణ్, భజరంగ్ దళ్ జిల్లా అధ్యక్షుడు శివకృష్ణ, ప్రభాకర్, విష్ణువర్ధన్‌రెడ్డి, రమేష్ తదితరులు ఉన్నారు.

పనులు నాణ్యతగా చేపట్టాలి



పాన్‌గల్: గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలను నిబంధనల మేరకు నాణ్యతగా చేయాలని పీఆర్ ఏఈ సత్తయ్య కాంట్రాక్టర్లకు సూచించారు. సోమవారం మండలంలోని దొండాయిపల్లిలో రూ.20 లక్షల ఎస్‌డీఎఫ్ నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్ల నిర్మాణాలను ఏఈ పరిశీలించారు. నిర్మాణాలకు వాటర్ క్యూరింగ్ బాగా చేయాలని, నిర్మాణ పనుల్లో నాణ్యత లోపిస్తే బిల్లులు నిలుపుదల చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్యామల, బీఆర్‌ఎస్ నాయకులు సుధాకర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

రేషన్ బియ్యం కోటా తగ్గించొద్దు



వనపర్తి: పేదలకు ఇచ్చే రేషన్ బియ్యం కోటాను తగ్గించొద్దని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం వనపర్తి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఆర్డీఓ కార్యాలయం ఏఓ మతీన్‌కు వినతిపత్రం అందజేశారు. ఆహారభద్రత కార్డులోని ఒక్కొక్కరికి 6 కేజీల చొప్పున బియ్యం ఇవ్వాలని వినతిపత్రంలో కోరారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రేషన్ కార్డులు మంజూరు చేయాలని, కనీసం మార్పులు, చేర్పుల కోసం చేసిన దరఖాస్తులను సైతం రాష్ట్ర ప్రభుత్వం పరిశీలించక పోవటం శోచనీయమని మండిపడ్డారు. ప్రభుత్వం తగ్గించిన కోటాను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మేకల ఆంజనేయులు, రాజు ,లక్ష్మన్న, రాముడు, ఆంజనేయుడు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు సంరక్షించాలి

పాన్‌గల్: పంచాయతీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్సరీల్లో మొక్కలు ఏపుగా పెరిగేలా తగు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి సిబ్బందికి సూచించారు. సోమవారం మండలంలోని కొత్తపేటలో నర్సరీని పరిశీలించారు. మొక్కలకు క్రమం తప్పకుండా వాటర్ అందించాలని, మొక్కల వివరాలను తెలిపే బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. నిర్దేశించిన లక్ష్యం మేరకు మొక్కలను పెంచాలన్నారు. జీపీల ద్వారా సేకరించిన చెత్తను పొడి, తడి చెత్తగా వేరు చేసి వాటి ద్వారా కంపోస్టు ఎరువును తయారు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నర్మద, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌కు సన్మానం

వనపర్తి క్రైం: ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ సునందిని సోమవారం జన విజ్ఞాన వేదిక జిల్లా కమిటీ సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించారు. వనపర్తిలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేయడం, అందుకు ప్రిన్సిపాల్ కృషి చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక సభ్యులు జితేందర్, దేవని ప్రవీన్, నరేందర్, రామన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

భూమిలేని వారికి దళితబంధు ఇవ్వాలి

వనపర్తి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న దళిత బంధు పథకం నిరుపేదలకు అందేలా చూడాలని మండలంలోని తిరుమలయ్యపల్లికి చెందిన దళితులు సోమవారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రజావాణిలో కలెక్టర్ షేక్ యాస్మీన్‌బాషాకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా కార్యదర్శి తిరుమలేష్, నాయకులు రమేష్, మంజుల, దళితులు తదితరులు పాల్గొన్నారు.

దళిత కాలనీల అభివృద్ధే లక్ష్యం

- రూ.50లక్షలతో సీసీ రహదారుల పనులకు శ్రీకారం
- ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి



పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

అమరచింత: రాష్ట్ర వ్యాప్తంగా దళిత కాలనీల అభివృద్ధి చేయడానికి సీఎం కేసీఆర్ ప్రత్యేక నిధులు మంజూరు చేశారని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని నాల్గో, ఐదో వార్డులో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మంజూరైన రూ.50 లక్షలతో నిర్మించే సీసీ, డ్రెయినేజీ పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీల్లోని దళిత వాడల అభివృద్ధి కోసం రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేకంగా నిధులను మంజూరు చేశారన్నారు. ఈ సందర్భంగా దళిత కాలనీలను సుందరంగా తీర్చిదిద్ది కొత్త సొబగులు తీసుకొస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. మున్సిపాలిటీ అభివృద్ధిలో పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ ముందుక రావాలని, అప్పుడే పట్టణంగా వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. పట్టణంలోని ఆయా వార్డులకు ఎలాంటి పనులు అవసరం ఉన్నాయో సామూహికంగా చర్చించి వాటి కోసం మంజూరైన నిధులను వినియోగించుకోవాలని సూచించారు.

అందరి అభిప్రాయం మేరకే..

ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోని సమస్యలపై దృష్టి సారించాలని, కౌన్సిలర్లు అందరూ ప్రజల అభిప్రాయాలను సేకరించి ముందడుగు వేయాలని ఆదేశించారు. ఉమ్మడి రాష్ట్రంలో మరుగున పడిన దళిత వాడల్లో అన్ని వసతులు కల్పించాలని సీఎం కేసీఆర్ ఆలోచించి వార్డుల అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయడం కాలనీ ప్రజల అదృష్టమన్నారు. దళిత వర్గాల అభ్యున్నతి కోసం దళిత బంధు పథకం తీసుకొచ్చి ఆదుకుంటున్న ఏకైక ప్రభుత్వం తమదే అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, కౌన్సిలర్లు రాజ్‌కుమార్, సింధు, లక్ష్మి, కమిషనర్ మహమ్మద్ ఖాజా, మార్కెట్ చైర్మన్ ఎస్‌ఏ రాజు, టీఆర్‌ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు రమేష్ ముదిరాజ్, అక్కల నరసింహులు గౌడ్, కోఆప్షన్ సభ్యులు షానవాజ్, అడ్వకేట్ రాజేందర్, నాయకులు చిన్న బాలరాజ్, రఫిక్, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సహకారంతో అభివృద్ధి



సీసీ రోడ్ల నిర్మాణ భూమిపూజ చేస్తున్న ఎంపీపీ, సర్పంచ్‌లు

పాన్‌గల్: కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి సహకారంతో మండలంలో అనేక అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని దావాత్‌ఖాన్‌పల్లిలో రూ.20 లక్షల ఎస్‌డీఎఫ్ నిధులతో చేపట్టే సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి సర్పంచ్ నాగేష్‌నాయుడుతో కలిసి ఎంపీపీ భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహిస్తున్న అభివృద్ధి పనులను నిబంధనల మేరకు నాణ్యతగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో బహదూర్‌గూడెం సర్పంచ్ విష్ణు నాయుడు, మంగళ్లపల్లి సర్పంచ్ అంజి, బీఆర్‌ఎస్ నాయకులు దశరథనాయుడు, భాస్కర్‌రెడ్డి, రాంబాబు, రాజు, శ్రీనునాయుడు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మండల కేంద్రానికి చెందిన ఆది చిన్నకిష్టయ్య అనారోగ్యంతో మృతి చెందటంతో సోమవారం ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని కుటుంబానికి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ బాలస్వామియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

6 వాహనాలకు వేలం

వనపర్తి క్రైం: జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ కార్యాలయంలో మంగళవారం 6 వాహనాలకు వేలం నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ సుభాష్‌చందర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించే వేలంలో ఆసక్తి గల వారు రూ.5వేల డిపాజిట్ చేసి వేలంలో పాల్గొనాలని ఆయన కోరారు.

ఆయిల్‌పాం సాగుతో లాభాలు

వీపనగండ్ల: రైతులు ఆయిల్‌పాం పంటను సాగు చేసి ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీని పొందాలని ఏఓ డాకేశ్వర్‌గౌడ్ అన్నారు. సోమవారం గోవర్ధనగిరిలో ఆయిల్‌పాం పంటల సాగు, ప్రభుత్వం అందించే సబ్సిడీ అనే అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయిల్‌పాం పంటను సాగు చేస్తే మొక్కల కొనుగోలు, పంట యాజమాన్యం అంతర పంటల సాగు, ఉపాధి హామీ తదితర విధాలుగా ప్రభుత్వం నుంచి నాలుగేళ్ల వరకు సబ్సిడీ అందుతుందని ఆయన రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ శివ, రైతులు డి వెంకటస్వామి, మహెబూబ్‌పాష, వెంకటస్వామి పాల్గొన్నారు.

పిల్లలను బడిలో చేర్పించాలి

పాన్‌గల్: బడి ఈడు కలిగిన పిల్లలు బడి బయట ఉండకుండా బడిలో చేర్పించాలని ఎంఈఓ లక్ష్మణ్ నాయక్ విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. సోమవారం మండలంలోని శాగాపూర్, శాగాపూర్ తండా, కదిరెపాడు, చిక్కేపల్లి, దావాజిపల్లిలో విద్యాశాఖ ఆధ్వర్యంలో బడిబయటి పిల్లల గుర్తింపుపై నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను ఆయన పరిశీలించారు. సీఆర్పీలు గోవింద్‌నాయక్, భార్గవి, రమాదేవి, ఐఈ ఆర్పీ నరేందర్ పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను విజయవంతం చేయాలి



పెద్దమందడిలో ఎంపీపీ మేఘారెడ్డి



గోపాల్‌పేటలో మాట్లాడుతున్న ఎంపీపీ సంధ్య

కొత్తకోట రూరల్ (పెద్దమందడి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు విజవంతం చేయాలని ఎంపీపీ మేఘారెడ్డి కోరారు. సోమవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులతో ఎంపీపీ మేఘారెడ్డి, జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఈనెల 18నుంచి కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని, మండలంలోని 22 గ్రామాలకు గానూ రెండు టీంలు పాల్గొంటాయన్నారు. మొదటి రోజు వెల్టూర్, వీరాయిపల్లి గ్రామాల్లో ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఇస్మాయిల్, డాక్టర్ మంజుల, జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, ఎంపీడీఓ అఫ్జల్, ఎంపీఓ రాజు, వైస్ ఎంపీపీ రఘుప్రసాద్, అంగన్‌వాడీలు ఉన్నారు.

గోపాల్‌పేట: ఈనెల 18 నుంచి రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభమవుతున్న నేపథ్యంలో సోమవారం ఎంపీపీ సంధ్య అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి సెంటర్‌లో రోజుకు 300 మందికి పరీక్షలు చేసేలా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. అంతేకాకుండా ఆశావర్కర్లు, సిబ్బంది ఎప్పుడూ అప్రమత్తంగా ఉండి ప్రజలకు వైద్య సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు భార్గవి, సర్పంచ్ శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ శేఖర్, అధికారులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం



చిన్నంబావి: మండలంలోని అమ్మాయిపల్లికి చెందిన మాధగాని రామన్‌గౌడ్, అతడి భార్య కొన్ని నెలలుగా అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరితో పాటు కర్నె శోభారాణి తండ్రి సత్యనారాయణగౌడ్‌కు మంజూరయిన సీఎంఆర్ ఎఫ్ చెక్కులను జెడ్పీటీసీ కేసీరెడ్డి వెంకట్రామమ్మ బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో చిన్నారెడ్డి, రాణి జయగౌడ్, కిరణ్‌కుమార్‌గౌడ్ ఉన్నారు.

కేసీఆర్ పీఎం కావాలంటూ పాదయాత్ర

కొత్తకోట: సీఎం కేసీఆర్ ప్రధాని కావాలని జోగులాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం వేములకు చెందిన సీఆర్పీఎఫ్ రిటైర్డ్ హెడ్‌కానిస్టేబుల్ ఆనంద్ అలంపూర్ జోగులాంబ ఆలయం నుంచి ప్రగతి భవన్ వరకు పాదయాత్ర చేపట్టారు. ఆనంద్ పాదయాత్ర సోమవారం కొత్తకోటకు చేరుకుంది. పాదయాత్ర చేస్తున్న ఆనంద్‌కు జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్, స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో అమడబాకుల సర్పంచ్ బుచ్చన్న, పరశురాములు, కుర్మన్న, ఆంజనేయులు, వెంకటన్న, బాలయ్య, చంద్రశేఖర్, సాయిలు తదితరులు ఉన్నారు.

సగరుల అభ్యున్నతికి కృషి

కొత్తకోట: పట్టణ సగర (ఉప్పర) యువజన సంఘాన్ని ఏకగ్రీవంగా ఎన్నిక చేసినట్లు గౌరవ అధ్యక్షుడు జి.విజయ్‌భాస్కర్‌సాగర్ తెలిపారు. అధ్యక్షుడిగా సురేష్‌సాగర్, ప్రధాన కార్యదర్శిగా పి.వినోద్ సాగర్, కోశాధికారిగా చీర్ల కురుమూర్తి, ఉపాధ్యక్షులుగా నరేంద్రసాగర్, రాజుసాగర్, బెక్కెం రమేష్ సాగర్, సహాయ కార్యదర్శులుగా విజయ్‌కుమార్ సాగర్, చీర్ల రాజుసాగర్, కృష్ణయ్యసాగర్, యాదయ్యసాగర్ ఎన్నికయ్యారు.

మాలధారులకు అన్నదానం

ఆత్మకూర్: పట్టణంలోని శ్రీబాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో సోమవారం 120మంది శివ మాల ధారణ చేపట్టారు. మొదటి రోజు గురుస్వాములు కరుణాకర్, మాలకృష్ణ, బాల్‌రాజు, అంజి, రఘు, నరేందర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మాలధారులకు దీక్ష నియమాలను తెలియజేశారు. మొదటిరోజు ట్రాన్స్‌కో లైన్‌మెన్ మహేష్ ఆధ్వర్యంలో శివ దీక్షాపరులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

ఫాతిమాకు ఘన నివాళి

వనపర్తి టౌన్: దేశ మొదటి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలు, సావిత్రిబాయి పూలేతో కలిసి బడుల ఏర్పాటుకు పాటుపడిన సంఘ సంస్కర్త ఫాతిమా షేక్ సేవలు మరువలేనివని ప్రజావాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్ అన్నారు. సోమవారం ఫాతిమా షేక్ జయంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో టీజేఏసీ ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డాక్టర్ నాయకంటి నరసింహశర్మ, కవి ఈశ్వర్, డప్పు నాగరాజు, బాలస్వామి నాయుడు, నిదర్శన్‌గౌడ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ అవినీతిని ఎండగడతాం



శ్రీరంగాపురంలో మాట్లాడుతున్న చిన్నారెడ్డి

పెబ్బేరు రూరల్(శ్రీరంగాపురం): సకల జనుల ప్రజా సంఘర్షణ యాత్రలో బీఆర్‌ఎస్ అవినీతిని ఎండగడుతామని ఏఐసీసీ కార్యదర్శి జి.చిన్నారెడ్డి పిలుపునిచ్చారు. ఆయన సోమవారం మండల కేంద్రంలోని రంగనాయక స్వామి ఆలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. జిల్లా అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ నాయకులు అంతా కలిసికట్టుగా ఐక్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమని, భారత్ జోడో యాత్ర ఆశయాలను ప్రతి ఇంటికి చేరవేయాలని పిలుపునిచ్చారు. బీసీ సెల్ అధ్యక్షుడు కోట్ల రవి, రాములు, యాదయ్య, దివాకర్ యాదవ్, గంగాధర్ యాదవ్ పాల్గొన్నారు.

భారత్ జోడో యాత్రతో ప్రజల్లో ధైర్యం

పెబ్బేరు: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడ్ యాత్రతో దేశంలోని ప్రజలు ఐక్యతను చాటారని ఏఐసీసీ కార్యదర్శి, మాజీ మంత్రి చిన్నారెడ్డి అన్నారు. పట్టణ కేంద్రంలోని శ్రీకన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఏఐసీసీ కార్యదర్శి, క్రమశిక్షణ కమిటీ చైర్మన్ చిన్నారెడ్డి సమక్షంలో మండల అధ్యక్షుడిగా ఎద్దుల విజయవర్ధన్‌రెడ్డి, మున్సిపాలిటీ పట్టణ అధ్యక్షుడిగా కారుపాకుల వెంకట్రాములు యాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మానవత్వం చాటుకున్న మాజీ మంత్రి

వనపర్తి క్రైం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ మహిళను మాజీ మంత్రి చిన్నారెడ్డి తన వాహనంలో తీసుకొచ్చి జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చేర్పించి మానవత్వం చాటుకున్నారు. సోమవారం పెద్దగూడెం క్రాస్ రోడ్డు వద్ద జిల్లా కేంద్రంలోని ఎన్‌టీఆర్ కాలనీకి చెందిన గంగమ్మ రోడ్డు ప్రమాదంలో గాయపడింది. దీంతో అటుగా వెళ్తున్న మాజీ మంత్రి చిన్నారెడ్డి బాధిత మహిళను తన వాహనంలో జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. అనంతరం వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

పోలీస్ కొలువులు సాధించాలి

ఆత్మకూర్: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన పోలీస్ కానిస్టేబుల్ ఈవెంట్స్‌లో అర్హత సాధించిన అభ్యర్థులకు ఒకటో వార్డు కౌన్సిలర్ చెన్నయ్య రూ.25వేలు విలువ చేసే స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో సీఐ కేఎస్ రత్నం, ఎస్‌ఐ పుట్ట మహేష్‌గౌడ్, కమిషనర్ రమేష్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవియాదవ్ చేతుల మీదుగా స్టడీమెటీరియల్ అందించారు. ఎస్‌ఐ మహేష్‌గౌడ్ అభ్యర్థులకు రూ.5వేలు నగదు ఇచ్చారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



ఆత్మకూర్: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడుతున్నాయని, విద్యార్థులు ప్రైవేట్‌కు దీటుగా రాణించాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, వీజేఆర్ ఫౌండేషన్ అధినేత వర్కటం జగన్నాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని గుంటిపల్లి ప్రభుత్వ పాఠశాలను వర్కటం జగన్నథ్‌రెడ్డి సందర్శించారు. పాఠశాలకు మౌలిక సదుపాయలు కల్పించడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేందుకు రూ.45వేలు విలువ చేసే స్మార్ట్ టీవీని అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వగ్గు ఉమాశంకర్, ఉపాధ్యాయులు రామచంద్రయ్య, మాసన్న, రాములు, రాములు, సాయిలు, శ్రీను, ఎస్‌ఎంసీ చైర్మన్ నర్సింహులు, గ్రామస్తులు లక్ష్మణ్‌గౌడ్, మోహన్, అనిల్, స్వరాజ్, విద్యార్థులు ఉన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా రోడ్డు నిర్మాణం

- పనులు నిలిపివేయాలన్న అధికారులు
- రూ.2.83 కోట్లతో పనులు



రోడ్డు పనులు పరిశీలిస్తున్న అధికారులు

ఆత్మకూర్: పట్టణంలోని గాంధీచౌక్ నుంచి చెరువు కట్ట వరకు రూ.50లక్షలతో చేపడుతున్న రోడ్డు నిర్మాణం వివాదాస్పదంగా మారింది. దీంతో పనులను నిలిపి వేయాలని అధికారులు ఆదేశించారు. ఆరు రోజులుగా చెరువు కట్ట నుంచి గాంధీచౌక్ వరకు మున్సిపాలిటీ నిధులతో సీసీరోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. విషయం తెలుసుకున్న పబ్లిక్‌హెల్త్ ఈఈ విజయభాస్కర్‌రెడ్డి, పీఆర్‌డీఈ శ్రీనివాస్, ఏఈ ధర్మరాజు, ఆర్‌అండ్‌బీ ఏఈ నాగరాజు నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న నిర్మాణ పనులను నిలిపి వేయాలని కాంట్రాక్టర్‌కు స్పష్టం చేసారు. రోడ్డు విస్తరణ అనంతరం చేపట్టిన డ్రెయినేజీ నిర్మాణం రోడ్డుకు ఎంతో ఎత్తులో ఉందని, ఒక మీటరు మేర ఎత్తులో రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు రూ.2.83 కోట్ల నిధులతో టెండర్ దశలో ఉందని త్వరలోనే పనులను ప్రారంభిస్తామన్నారు. అలాగే కల్వర్టు కూడా నిర్మించాల్సి ఉందని, అంతవరకు పనులు నిలిపివేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఎన్నో రోజుల నుంచి గుంతలమయంగా ఉన్న రోడ్డుపై ప్రయాణం ప్రమాదభరితంగా మారిందని, అప్పుడు స్పందించని అధికారులు జరుగుతున్న పనులను అడ్డుకోవడం విడ్డూరంగా ఉందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవియాదవ్ అసహనం వ్యక్తం చేశారు. త్వరగా రోడ్డు నిర్మాణ పనులను చేపట్టి ప్రయాణికుల ఇబ్బందులను తొలగించాలని కోరారు. కార్యక్రమంలో కమిషనర్ రమేష్, కౌన్సిలర్లు తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత



రామన్‌గౌడ్‌కు ఆర్థికసాయం అందజేస్తున్న గౌడ సంఘం నాయకులు

కొత్తకోట: మండలంలోని మిరాసిపల్లికి చెందిన రామన్‌గౌడ్ 15రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స అనంతరం ఇంటికి వచ్చిన రామన్‌గౌడ్ నేటికీ కోలుకోకపోవడంతో పాటు ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండడంతో జిల్లా గౌడసంఘం గౌరవ అధ్యక్షుడు, జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు పలుస శ్రీనివాస్‌గౌడ్ ఆదేశానుసారం మండల గౌడ సంఘం నాయకులు సోమవారం మిరాసిపల్లికి వెళ్లి రామన్‌గౌడ్‌ను పరామర్శించి రూ.20వేలు ఆర్థికసాయం అందజేశారు. వైద్య ఖర్చుల కోసం రానున్న రోజుల్లో సహాయం చేసేందుకు గౌడసంఘం సిద్ధంగా ఉందని కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్నిచ్చారు. కార్యక్రమంలో జీవన్‌గౌడ్ భగవంత్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్, మండల నాయకులు నర్సింహ్మగౌడ్, మహాదేవ్‌గౌడ్, వెంకటన్నగౌడ్, తిరుపతన్నగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, ఆనంద్‌గౌడ్, రవిందర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

'భగీరథ' అధికారుల తీరుపై అసహనం



మాట్లాడుతున్న పంచాయతీరాజ్ ఏఈ ధర్మరాజు

అమరచింత: గ్రామాలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ప్రారంభించిన మిషన్ భగీరథ పథకం లక్ష్యం అధికారుల నిర్లక్ష్యంతో నీరుగారిపోతుందని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ఎంపీపీ డాక్టర్ చుక్క మాలతి అధ్యక్షతన సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మస్తీపురం గ్రామానికి తాగునీటి వ్యవస్థ అధ్వానంగా ఉందని, మిషన్ భగీరథ అధికారులు సమస్యను పరిష్కరించడంలో చొరవ చూపడం లేదని సభ్యులు ఆరోపించారు. గ్రామాల్లో తాగునీటి పైప్ లైన్లు లీకేజీలు ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదంటూ ఒకరి తర్వాత ఒకరు సభ్యులు సభలో ఏకరువు పెట్టారు. దీనిపై మిషన్ భగీరథ ఏఈ రుక్మేందర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లోని సమస్యలను సర్పంచ్‌ల ద్వారా తెలుసుకొని, వాటిని వేగంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం మిట్టనందిమళ్ల సర్పంచ్ సర్వారెడ్డి మాట్లాడుతూ ఏడాది కాలం దాటుతున్న ఇప్పటి వరకు చేసిన పనులకు బిల్లులు ఎందుకు ఇవ్వడం లేదని ఏఈ ధర్మారాజును ప్రశ్నించారు. మండలం మొత్తంలో ఇదే పరిస్థితి ఉందని ఆయా గ్రామాల సర్పంచ్‌లు తెలిపారు. ప్రస్తుతం రాని బిల్లుల గురించి మాట్లాడని ఏఈ సీఎం నిధుల ద్వారా మంజూరైన రూ.20 లక్షలను గ్రామాలు వినియోగించుకోవాలని చెప్పటం ఏమిటని మండిపడ్డారు. దీంతో ఏఈ ధర్మారాజు స్పందిస్తూ ఆలస్యం అయినా చేసిన పనులకు బిల్లులు పూర్తిస్థాయిలో వస్తాయన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ మార్క సరోజ, వైస్ ఎంపీపీ బాల్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ ఎస్‌ఏ రాజు, తహసీల్దార్ చాంద్‌పాషా, ఎంపీడీఓ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

పెబ్బేరు: రాంపూర్‌కు చెందిన మాజీ సర్పంచ్ గోపాల్‌యాదవ్ మృతి చెందగా.. విషయం తెలుసుకున్న రాష్ట్ర వ్యవసాయశాఖ సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గోపాల్‌యాదవ్ ముడుసార్లు సర్పంచ్‌గా ఎన్నికై ఎన్నో అభివృద్ధి పనులు చేసి ప్రజల గుండెలో నిలిచారని కొనియాడారు. ఆయన మృతి బీఆర్‌ఎస్‌కు తీరనిలోటన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పద్మ, ఎంపీపీ ఆవుల శైలజ, మున్సిపల్ చెర్‌పర్సన్ కరుణశ్రీ, వైస్ చైర్మన్ కర్రెస్వామి, సర్పంచ్ బస్వరాజు, వెంకటయ్యయాదవ్, రాజశేఖర్, మాధవరెడ్డి, సితార వెంకటేశ్వర్లు, గోల్డ్ బాలస్వామి, అంజనేయులు, బీఆర్‌ఎస్ నాయకులు వనం రాములు యాదవ్, దిలీప్‌కుమార్‌రెడ్డి, వెంకటేష్, కురుమూర్తి, సాయినాథ్, మేకల ఎల్లయ్య పాల్గొన్నారు.

కొత్తకోట: మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తున్న శ్యాంసుందర్ (45) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న 8వ వార్డు కౌన్సిలర్ చీర్ల నాగన్నసాగర్ శ్యాంసుందర్ ఇంటికి వెళ్లి ఆయన మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు.

జేఎస్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

జేఎస్‌ఆర్ ఫౌండేషన్ సభ్యులు సోమవారం ఉదయం శ్యాంసుందర్ మృతదేహానికి నివాళర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం దహన ఖర్చుల నిమిత్తం ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ప్రేమయ్య, ప్రశాంత్, శాంతిరాజ్, సుభాష్, సతీష్‌రాజ్, కర్ణకుమార్, రాజేష్, సంతోష్‌రాజ్ తదితరులు ఉన్నారు.

80 మందితో రెడ్‌క్రాస్ లైఫ్ టైమ్ సభ్యత్వాలు



ఖిల్లాఘనపురం: మండలంలో మొత్తం 80 మందితో రెడ్‌క్రాస్ లైఫ్‌టైమ్ సభ్యత్వాలు చేయించినట్లు ఎంపీడీఓ విజయ్‌కుమార్ తెలిపారు. ముందుగా 40 మంది, సోమవారం మరో 40 మంది సభ్యత్వాల బుక్కులతో పాటుగా నగదును జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌కుమార్, జెడ్పీసీఈఓ వెంకట్‌రెడ్డి, డీఆర్‌డీఓ నర్సింహులులకు అందించామన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ రాజు, పంచాయతీ కార్యదర్శులు రాఘవేందర్, రవితేజ పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు బస్సు ప్రారంభం

ఖిల్లాఘనపురం: ఖిల్లాఘనపురం గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు వనపర్తి ఆర్టీసీ డిపో మేనేజర్ పరమేశ్వరి వనపర్తి నుంచి మండల కేంద్రం మీదుగా హైదరాబాద్‌కు బస్సును పునఃప్రారంభించారని సామాజిక కార్యకర్త కమ్మరి గోపి అన్నారు. సోమవారం మండలానికి వచ్చిన బస్సుకు స్థానికులు పూజలు చేశారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతు మండల ప్రజలంతా ప్రైవేట్ వాహనాల్లో వెళ్లకుండా ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణం చేయాలన్నారు. కార్యక్రమంలో భూమయ్య, ఆశన్న, శ్రీను, పల్లాటి శ్రీనివాసులు, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.